క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని రింగ్‌రోడ్డులో గల విద్యుత్ స్తంభాలను మార్చుతున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దద్దనాల చెరువు కాలనీ, మల్లన్న నగర్, వెంకట్ నగర్, టీచర్స్ కాలనీ, గణేష్ నగర్, ఎన్‌జీవోస్ కాలనీ, కొత్త బస్టాండ్ ఏరియాలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో..

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం సబ్‌స్టేషన్‌లో అంతర్గత మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్‌లో పరిధిలోని నల్లబండగూడెం, చిమిర్యాల, రెడ్లకుంట గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె.సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరేడుచర్ల పట్టణంలో..

నేరేడుచర్ల : దిర్శించర్ల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ నేరేడుచర్ల టౌన్ -1 ఫీడర్ కింద నేరేడుచర్ల సెంటర్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కి వచ్చే 11కేవీ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాపురం రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, లైబ్రరీ బజారు, పోస్టాఫీసు రోడ్డు, హుజూర్‌నగర్ రోడ్డులో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన అటెండర్‌కు సన్మానం



అటెండర్ నాగరత్నం- పుల్లయ్య దంపతులను సన్మానిస్తున్న పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బంది

కోదాడరూరల్ : కోదాడ పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న కాంపాటి నాగరత్నం ఉద్యోగ విరమణ పొందింది. ఈ సందర్భంగా శనివారం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నాగరత్నం దంపతులను పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, పార సీతయ్య, చింతలపాటి శ్రీనివాస్, తోట జ్యోతిశ్రీనివాస్, డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరిలో అతి పురాతనమైన సీతారామచంద్రస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం అర్చకులు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, యంత్రాలకు అభిషేకం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడకు చెందిన యాగ్నికులు మురళీకృష్ణ శర్మ బృందంతో ఈ వేడుక నిర్వహించారు. అర్చకులు దామోదరాచార్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా కమిటీ సభ్యులు సోమగాని కృష్ణ, వెంకన్న, జక్కుల శ్రీను పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మోతె : జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం వెంకన్న, ఎంపీడీఓ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో జాతీయ పతాకం ఆవిష్కరణ ఉంటుందన్నారు. కార్యాలయాల సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు.

ఊరంతా ‘ఉపాధి’ బాట

- గ్రామంలో అన్నీ సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు
- 120 జాబ్ కార్డులు
- కార్డున్న ప్రతిఒక్కరూ వేసవిలో ఉపాధి హామీ పనులకు హాజరు



వెంకట్రాంపురంలో ఎస్సారెస్పీ కాల్వ పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

నడిగూడెం : ఆ గ్రామంలో అన్ని చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు. అయినా ఊరంతా ప్రస్తుత వేసవిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. నడిగూడెం మండలంలోని కరివిరాల ఆవాస గ్రామం వెంకట్రాంపురం. నడిగూడెం మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలో రెండు వార్డులున్నాయి. జనాభా దాదాపు 400 మంది ఉన్నారు. గ్రామంలో అంతా చిన్న, సన్న కారు రైతుల కుటుంబాలే. కానీ ప్రస్తుత వేసవిలో ఉపాధి హామీ పనులకు మాత్రం ఊరంతా హాజరవుతున్నారు. గ్రామంలో దాదాపు 120 జాబ్ కార్డులున్నాయి. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు హాజరు కావడం గమనార్హం. ప్రతి సీజన్‌లో గ్రామంలో వరి, పత్తి, మిరప, కంది, పెసర, నిమ్మ తదితర పంటలు సాగు చేసుకుంటూ జీవనం పొందుతున్నారు. గ్రామంలో అధికంగా ఆవులు ఉండడం విశేషం. ఇప్పటికీ అక్కడ ఎక్కువగా ఎద్దులతో వ్యవసాయం చేస్తున్నారు.

రెండు నెలలుగా పనులు..

వెంకట్రాంపురంలో గత రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వల పూడికతీత, భూమి అభివృద్ధి పనులు, శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న మేజర్, మైనర్ కాలువల పూడికతీత, రోడ్లు, డొంకలు, కాల్వలలో ఇరువైపులా కంపచెట్ల తొలగింపు తదితర పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామంలో అందరూ రైతులు కావడంతో ఉపాధి హామీ పనులు పూర్తయిన వెంటనే వ్యవసాయ పనుల్లో బిజీ అవుతారు.

సొంత పనిలా చేస్తాం



మా గ్రామంలో అంతా రైతు కుటుంబాలకు చెందిన వాళ్లం. వేసవిలో ప్రతి రైతు కుటుంబం ఉపాధి పనులకు హాజరవుతారు. ఉపాధి హామీ అధికారులు కల్పి స్తున్న పనులను మా సొంత పనిలాగా చేస్తాం. కూలీ కూడా కొలతల ప్రకారం అందుతుంది.

– కైగూరి విజయలక్ష్మి, ఉపాధి కూలీ, వెంకట్రాంపురం

సద్వినియోగం చేసుకుంటున్నాం



ప్రస్తుత వేసవిలో కల్పిస్తున్న ఉపాధి పనులతో ఊరంతా ఉపాధి పొందుతున్నాం. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కూలీ పనులను సద్వినియోగం చేసుకుంటున్నాం. ఊరంతా చిన్న, సన్నకారుకు చెందిన రైతు కుటుంబాలే. ఉపాధి హామీ పథకం కింది రైతుల భూ అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారు.

– సుంకరి లక్ష్మి, ఉపాధి కూలీ, వెంకట్రాంపురం

పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌డీఓ, నాయకులు

హుజూర్‌నగర్ : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో పర్యావరణ దినోత్సవ వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవాలని, ప్రకృతి బాగుంటేనే భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ప్రజా కళాకారుడు బాదె నరసయ్య మాట్లాడుతూ.. పర్యావరణంపై అవగాహన కోసం జూన్ 5న టౌన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమగాని నరేందర్ గౌడ్, పి.ఎల్లారెడ్డి, పి.లింగయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

కోదాడరూరల్ : సహకార సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంఘ సంవత్సర కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు తోడ్పాటును అందించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ఆడిటర్ పద్మజ, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు పారా సీతయ్య, చింతలపాటి శ్రీనివాసరావు, తోట జ్యోతి, వైస్ చైర్మన్ నరేష్, డైరెక్టర్‌లు శిరంశెట్టి వెంకటేశ్వర్లు, రమాదేవి, పార్వతి, ప్రభాకర్‌రావు, కమతం వెంకటయ్య, బాబు, శ్రీనివాసరావు, సీతరామయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అనంతగిరి : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని పలువురు మాజీ సర్పంచ్‌లు కోరారు. ఈమేరకు ఆదివారం అనంతగిరి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సర్పంచ్‌లుగా ఉన్న సమయంలో చేసిన పనులకు గాను రావాల్సిన బిల్లులు నేటి వరకు చెల్లించకపోవడంతో తాము రోడ్డున పడాల్సి వస్తోందని తెలిపారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు రెట్టింపు అవుతున్నాయని, ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లించకపోతే తమ జీవితాలు అగమ్యగోచరంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వేనేపల్లి వెంకటేశ్వరరావు, బద్దం కృష్ణారెడ్డి, నెల్లూరి లీలావతి బాబురావు, లలిత, లక్షమాల జానమ్మ అప్పారావు, వాడకొప్పుల శేషమ్మ కోటేశ్వరరావు, బుర్ర రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో కేంద్రం రూ.73 వేల కోట్లు నామమాత్రపు నిధులు కేటాయించి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ. 600 చెల్లించడంతో పాటు జాబ్ కార్డులేని పేదలందరికీ నూతన జాబ్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సంఘం మండల నాయకులు మాధవరావు, భద్రమ్మ, అరుణ, వెంకమ్మ, రాజ్యం, నర్సమ్మ, రామనర్సమ్మ, జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్ఐ బలరామిరెడ్డి

హుజూర్‌నగర్ : పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఏఎస్ఐ బలరామిరెడ్డి, ఆర్ఐ షరీఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మల్లన్ననగర్ లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని చెప్పారు. అన్ని కులాలు, వర్గాల వారు సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జక్కుల శంబయ్య, శాంతి సంఘం ఉపాధ్యక్షుడు కోడి ఉపేందర్,యువకులు, మహిళలు పాల్గొన్నారు

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

పాలకవీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995- 96లో విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇరవై తొమ్మిది ఏళ్ల తర్వాత ఒకే వేదికపైన కలుసుకున్న స్నేహితులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కాటయ్య, విద్యార్థులు మేకల మట్టపల్లి, బట్టు కమలాకర్‌రెడ్డి, వీరభద్రం, దిద్దకుంట్ల వీరారెడ్డి, రజని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలని వినతి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హుజూర్‌నగర్‌లో మండల వ్యవసాయ అధికారి స్వర్ణకు స్థానిక రైతుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీలుగు విత్తనాల ధర తగ్గించాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకటరెడ్డి, దేవరం మల్లీశ్వరి, దుగ్గి బ్రహ్మం, కిరణ్ రెడ్డి, నర్సిరెడ్డి, రవీందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, నవీన్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెంకటనరసింహారెడ్డి మృతి తీరని లోటు



వెంకటనరసింహారెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కోదాడ మార్కెట్ చైర్‌పర్సన్

మునగాల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొప్పుల వెంకటనరసింహారెడ్డి మృతి ఆయన కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కోదాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. కొప్పుల వెంకటనరసింహారెడ్డి మృతి పట్ల మునగాలలో శనివారం వారు సంతాపం ప్రకటించి నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. నివాళులర్పిస్తున్న వారిలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, నల్లపాటి శ్రీనివాస్, ఉప్పుల జానకిరెడ్డి, కాసర్ల శ్రీనివాసరావు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వేనేపల్లి వీరబాబు, ఉప్పుల యుగందర్‌రెడ్డి, చింతకాయల నాగరాజు, గంధం సైదులు, ఎలక నరేందర్‌రెడ్డి, కొమ్ము ఈదారావు, బీంపంగు శంకర్, గండు అంజయ్య, పనస విజయ్, సొంపంగు గోపి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, సీపీఎం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు చిల్లంచర్ల ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు కందిబండ సత్యనారాయణ, కృష్ణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో సీసీ కెమెరాలు ధ్వంసం

నడిగూడెం : మండల కేంద్రంలోని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు మూడు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయనాయక్ శనివారం తెలిపారు. ఇటీవల ఇంటర్ వార్షిక పరీక్షల పర్యవేక్షణ కోసం ఇంటర్మీడియట్ బోర్డు కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైవిధ్యమైన పంటలు సాగు చేయాలి



మోతె : అన్నారిగూడెంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీదేవి



మేళ్లచెరువు : మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

మోతె : రైతులు ఏక పంట విధానానికి స్వస్తి పలికి వైవిధ్యమైన పండించాలని భారత జాతీయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త బి.శ్రీదేవి అన్నారు. శనివారం మోతె మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు పంటల సాగులో మార్పులు చేపట్టాలన్నారు. సాగుకు అనువైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. డ్రోన్ ద్వారా పంటలకు పురుగు మందులు స్ప్రే చేసే పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం భూసార పరీక్షల పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపెల్లి శాస్త్రవేత్త నరేష్, మండల వ్యవసాయ అధికారిణి అరుణ, ఏఈఓ ఉష, ఆయిల్‌పామ్ తోటల ఇన్‌చార్జ్ శ్రీను, కవి సాగర్, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

మేళ్లచెరువు : భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలని వ్యసాయాధికారులు రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. భూసార పరీక్షలకు మట్టి సేకరించే విధానం, జీవ ఎరువుల వాడకం, ఎరువుల సమతుల్యత, చెరువు మట్టి, పశువుల ఎరువులు వాడకంతో ఉపయోగాలు, పచ్చిరొట్ట ఆవశ్యకత, యాంత్రిక పరికరాల వాడకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి శాస్త్రవెత్త ఎ.కిరణ్, మండల వ్యవసాయ అధికారి పద్మ, డాక్టర్ వి. మానస, ఏఈఓ నరేష్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



మోతెలో ప్రచార జాతలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

మోతె : ప్రభుత్వ బడులల్లోనే పిల్లలను చదివించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య పిల్లల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు శనివారం మోతె మండల కేంద్రంతో పాటు రావిపహాడ్, సిరికొండ గ్రామాల్లో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ ప్రచార జాతలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ బడుల్లో పిల్లలు లేక మూతబడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు బి.అడమ్, సీహెచ్.రమేష్, వి.రమేష్, డి.లాలు, జిల్లా మాజీ కార్యదర్శి సీహెచ్.వీరారెడ్డి, మండల అధ్యక్షుడు ఏలె శీనయ్య, మండల ప్రధాన కార్యదర్శి డి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నారసింహునికి గరుడవాహన సేవ



మట్టపల్లిలో గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామాచర్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న తెలుగు రాష్ట్రాల భక్తులు ఆలయంలో బసచేసి తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకం



పొగాకుతో దుష్ప్రభావాలపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హరినాథ్

నడిగూడెం : పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకమని నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు పొగాకుతో దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పొగాకు వినియోగించకుండా పిల్ల లపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమన్నారు. పొగాకు ఉత్పత్తులలో కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ సైనైడ్, అమ్మోనియా వంటి విషపూరిత రసాయనాలు, వాయువులు ఉంటాయని, అవి శరీరంలో ఆక్సిజన్ ప్రసరణను ప్రభావితం చేసి దెబ్బతీస్తాయని తెలిపారు. ఏడు వేలకు పైగా రసాయనాలు పొగాకులో ఉంటాయన్నారు. వీటిలో 250 హానికరమైనవి కాగా 69 క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలుగా గుర్తించబడ్డాయన్నారు. ఇవన్నీ గుండెజబ్బులు, ఊపిరితిత్తుల వ్యాదు లు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, సుజాత, రాధ, ఆశావర్కర్లు శ్రీలక్ష్మి, సైదమ్మ, సునీత, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, కూలీలు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ.. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం వీరయ్య, పీహెచ్ఎన్ శారద, ఆర్ఐ ప్రవీణ్, కృష్ణ, నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు కవిత, అంజలి, బాలకృష్ణ పాల్గొన్నారు.

డ్రైయినేజీ లేక.. వాననీరు పారక



పోలేనిగూడెంలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చిలుకూరు : చిన్నాపాటి వర్షానికి చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో 8వ వార్డులో గల కందిబండ పాండయ్య ఇంటి వద్ద గల సీసీ రోడ్డుపై నీరు నిలుస్తోంది. డ్రైయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. నడిరోడ్డుపై నీళ్లు నిలుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీళ్లు ఇళ్లలోకి కూడా చేరుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. గ్రామ అధికారులు స్పందించి వాననీరు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

హుజూర్‌నగర్ : అమరుల త్యాగాలను స్మరించుకోవాలని, అది అందరి బాధ్యత అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా జూన్ 2న సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం, చింతలపూడి రాములు వర్ధంతి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతోందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.